
సాక్షి ఒడిశా

గురువారం । 13 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,01,831లు, బంగారం 1.8 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

ADR Association for Democratic Reforms

టాప్-3లో సీఎం నవీన్

- దేశంలో మూడో ధనిక ముఖ్యమంత్రిగా రికార్డు

- 8లో▸



జపాన్ పర్యటన విజయవంతం

- 8లో▸

న్యూస్‌రీల్

బైక్ దొంగలు అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు, వాహనాలు

బరంపురం: బరంపురం జిల్లా పోలీసు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో దాడులు చేపట్టిన పోలీసులు బైక్ దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన కె.నువాగాం పోలీసులు.. వారి నుంచి 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సదర్ ఎస్‌డీపీఓ బిష్ణుప్రసాద్ పాత్రొ అందించిన సమాచారం ప్రకారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల అపహరణకు సంబంధించి నమోదైన ఫిర్యాదు మేరకు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితులు ఖుర్దా జిల్లా గోపాల్‌పూర్‌కు చెందిన శంకర్ సెఠి, ఆర్.ప్రవీన్‌రెడ్డి, ఎస్.శివశంకర్‌రెడ్డిగా గుర్తించి, అరెస్ట్ చేశారు. దీనిపై మిగతా వారి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మహికా వాకర్స్ సభ్యులు

రాయగడ: పట్టణంలోని బుదరావలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పుస్తకాలు, గొడుగులు, పెన్నులు బుధవారం పంపిణీ చేశారు. మహా విశుభ మిలన్(పానా సంక్రాంతి) పురస్కరించుకుని క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాల్లో భావంగా విద్యార్థులకు అవసరమైన వస్తువులను పంపిణీ చేసినట్లు అధ్యక్షురాలు కె.శోభారాణి తెలిపారు. సభ్యులు చంద్రమౌళి కుముంధాన్, వి.స్వాతి, వి.మాధవి శంకర్ పాల్గొన్నారు.

వడగాలుల వేధింపులు

భువనేశ్వర్: రాష్ట్రంలో వడగాడ్పులు వేధిస్తున్నాయి. వరుసగా మూడో రోజు కూడా వేడిగాలులు వీస్తుండగా గరిష్ట ఉష్ణోగ్రత పలు చోట్ల 40 డిగ్రీల సెల్సియస్ పైబడి నమోదయ్యాయి. బుధవారం ఝార్సుగుడ 43 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతతో అత్యంత వేడిమి పట్టణంగా నిలిచింది.

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
ఝార్సుగుడ	43.0
బరిపద	42.5
సంబల్‌పూర్	42.0
తాల్చేరు	41.6
బౌధ్	41.6
బొలంగీర్	41.2
టిట్లాగడ్	41.2
అంగుల్	41.1
సోన్‌పూర్	41.0
భద్రక్	41.0
సుందరగడ్	41.0
హీరాకుడ్	40.7
రార్కెలా	40.6
చాంద్‌బాలి	40.3

తండ్రి మందలించాడని.. బాలిక బలవన్మరణం



చెట్టుకు వేలాడుతున్న బాలిక మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితిలో తండ్రి మందలించాడని మనస్థాపానికి గురైన బాలిక బలవన్మరణానికి పాల్పడింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సమితిలోని ఎంవీ-43 గ్రామానికి చెందిన పూలిన్ మేస్త్రి.. తన కుమార్తె సంతోషి మేస్త్రి సెల్‌ఫోన్‌తో ఎక్కువ సమయం గడపడంతో అసహనానికి గురయ్యాడు. పరీక్షలు దగ్గర పడుతున్నా చదువుపై శ్రద్ధ చూపకుండా అదే పనిగా సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడటంతో ఆగ్రహానికి గురైన పూలిన్ మంగళవారం రాత్రి కుమార్తెను మందలించాడు. దీంతో ఫోన్ అక్కడే వదిలిన సంతోషి బయటకు వెళ్లిపోయింది. అయితే ఎవరి ఇంటికో వెళ్లి ఉంటుందని తల్లిదండ్రులు భావించారు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. బుధవారం ఉదయం గ్రామ శివారులో అటుగా వెళ్తున్న గ్రామస్తులకు చెట్టుకు వేలాడుతున్న సంతోషి మృతదేహం కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.



- పూరీ రథయాత్ర తొలి సమన్వయ సమావేశంలో ఆర్‌డీసీ దొలై
- సూచనలందించిన అధికారులు, సేవాయత్‌లు, మీడియా ప్రతినిధులు
- దివ్యాంగ భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు
- వన ప్రకల్ప్ ప్రాజెక్టుపై సుదీర్ఘ చర్చలు



సమావేశమైన జగన్నాథుని రథయాత్ర తొలి సమన్వయ కమిటీ

విశ్వవిఖ్యాత యాత్ర..
విజయవంతం కావాలి

భువనేశ్వర్: ఈ ఏడాది రథయాత్ర సందర్భంగా దివ్యాంగ భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. జగన్నాథుని రథయాత్ర నిర్వహణకు సంబంధించి జరిగిన తొలి సమన్వయ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పూరీ టౌన్ హాలులో ఈ సమావేశం బుధవారం నిర్వహించారు. సోదర, సోదరి సమేతంగా జగన్నాథుని వార్షిక రథయాత్ర సజావుగా నిర్వహించేందుకు తొలి సమన్వయ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి రెవెన్యూ డివిజనల్ కమిషనర్(సెంట్రల్ డివిజన్) సురేష్‌చంద్ర దొలై అధ్యక్షత వహించారు. ప్రపంచ ప్రసిద్ధ రథయాత్ర దిగ్విజయం చేయడంలో ప్రతి ఒక్కరిపాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, సేవాయత్‌లు, మీడియా ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. రథ నిర్మాణశాల నుంచి మొదలుకొని రథాల నిర్మాణం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, రవాణా, శాంతి భద్రతలు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. వీరందరి సహాయ, సహకారాలతో యాత్ర దిగ్విజయం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికార వర్గాలకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. యాత్ర నిర్వహణ ఆద్యంతాలు ఆచార వ్యవహారాలను సజావుగా, క్రమశిక్షణతో నిర్వహించడం, రద్దీ నియంత్రణ, అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయి వరకు ప్రతిఒక్కరి బాధ్యతలను సవివరంగా పేర్కొని అనుబంధ జాబితా జారీ చేశారు. ప్రధానంగా ఆరోగ్యం, విద్యుత్ సరఫరా వంటి సున్నితమైన అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

జగన్నాథ్ వన ప్రకల్ప్..

జగన్నాథ్ వన ప్రకల్ప్ సంబంధించి ఇటీవల ప్రత్యేక సమావేశం జరిగింది. భువనేశ్వర్ ఆర్‌సీసీఎఫ్, నయాగర్, ఖుర్దా భంజనగర్(ఉత్తర, దక్షిణ) జిల్లా అటవీశాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. స్వామి యాత్ర పురస్కరించుకుని ఏటా 3 కొత్త రథాలు తయారు చేసే ఆచారం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాణ్యమైన భారీ కలప దుంగలు ఏటా అవసరం అవుతుంది. దీర్ఘకాలంలో కలప కొరత తలెత్తకుండా శ్రీజగన్నాథ్ వన ప్రకల్ప్ ప్రాజెక్టుకు సంకల్పించారు. భావితరాలకు రథ కలప కొరత తలెత్తకుండా ఈ ప్రాజెక్టు దోహదపడుతుంది. అయితే ప్రాజెక్టు నిర్వహణ పట్ల అనుబంధ వర్గాలు అశ్రద్ధ కనబరుస్తున్నాయనే ఆరోపణలు బలం పుంజుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రథాల తయారీకి అనుకూలమైన కలపనిచ్చే చెట్ల పెంపకానికి అనుకూలమైన ప్రాంతాల్లో సంబంధిత వర్గాల చెట్లు నాటి సంరక్షించాల్సి ఉంది. ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆయా ప్రాంతాల్లో నాటిన చెట్ల పురోగతి, సంరక్షణ తదితర అంశాలకు సంబంధించిన డేటా బేస్ రూపకల్పనకు ఆదేశించినట్లు వివరించారు. డేటాబేస్ సిద్ధమైన తర్వాత రథాల తయారీకి సంబంధించిన ప్రాజెక్టు నిర్వహణ స్థితిగతులు స్పష్టమై సకాలంలో కలప కొరత తలెత్తకుండా తగు చర్యలు చేపట్టేందుకు వీలవుతుందని తెలిపారు.



హాజరైన సేవాయత్‌లు, ఇతరేతర వర్గాల ప్రతినిధులు

శ్రీమందిరం పరిక్రమ ప్రాజెక్టు..

ప్రస్తుతం కొనసాగుతున్న శ్రీమందిర పరిక్రమ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్నానయాత్ర లోగా ఈ పనులు పూర్తవుతాయని హామీ ఇచ్చారు. దివ్యాంగులు స్వామివారిని సులభంగా దర్శించుకునేందుకు వీలుగా బొడొ దండొ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఇటువంటి సౌకర్యం కల్పించడం ఇదే తొలిసారి కావడం విశేషం

సులభ దర్శనం..

ఈ ఏడాది రథయాత్ర పురస్కరించుకుని స్వామి స్నానయాత్ర నుంచి నీలాద్రి విజే వరకు భక్తుల సులభ దర్శనం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ, బయటి నుంచి వచ్చే భక్తులకు సరైన సమాచారం అందించడం వంటి అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అనుబంధ వర్గాలకు ఆదేశించారు. దివ్యాంగ భక్తులతో సహా అన్ని రకాల భక్తులు సాఫీగా దర్శనం చేసుకునేందుకు స్థానిక పోలీసు సూపరింటెండెంట్ బ్లూప్రింట్‌ను సిద్ధం చేశారని సమావేశం అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జనరల్(సెంట్రల్ రేంజ్) నర్సింగ భోల్ తెలిపారు. యాత్రలో కీలకమైన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించిన అనుభవజ్ఞులైన అధికారులు, సిబ్బంది ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ఏడాది పోలీసు దళాలను మోహరించనున్నట్లు తెలిపారు.

సీసీటీవీ నిఘా..

రథయాత్ర సందర్భంగా సంఘ విద్రోహక చర్యల నివారణకు యాత్ర ప్రాంగణంలో అడుగడుగున సీసీటీవీ నిఘా ఏర్పాటు అవుతుంది. ఈ వ్యవస్థ ట్రాఫిక్ నిర్వహణపై నిఘా వేస్తుందని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, ఎండోమెంట్స్ కమిషనర్, సమాచార, ప్రజాసంబంధాల శాఖ డైరెక్టర్, స్థానిక కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్, జగన్నాథ ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, సేవాయత్‌లు(సేవకులు), మేధావులు, మీడియా ప్రతినిధులు రథయాత్ర తొలి సమన్వయ సమావేశంలో పాలుపంచుకున్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ప్రభాకర్

- కిశోర్‌కుమార్‌పై 7ఓట్ల ఆధిక్యతతో విజయం



అధ్యక్షుడు ప్రభాకరరావు



సాధారణ కార్యదర్శి మాధవ



ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు



ఉపాధ్యక్షుడు నరేంద్ర బెహరా



సహాయ కార్యదర్శి లోకనాథ్ బెహరా



సహాయ కార్యదర్శి శ్రావణకుమార్ దాకా



కోశాధికారి మంగీలాల్ సాహూ

జయపురం: ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్(జయపురం) అధ్యక్షుడిగా వి.ప్రభాకరరావు విజయం సాధించారు. అధ్యక్ష అభ్యర్థిగా పోటీచేసిన రత్నాల కిశోర్‌కుమార్ చౌధునిపై 7ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ ఎస్.ఆనందరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈనెల 9న బ్యాలెట్ ద్వారా జరిగిన పోలింగ్‌లో మొత్తం 21మంది డైరెక్టర్లలో 19మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. పోలయిన 19 ఓట్లలో 13 ఓట్లు వి.ప్రభాకర్‌కు రాగా.. రత్నాల కిశోర్‌కుమార్‌కు అనుకూలంగా 6ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 7 ఓట్ల ఆధిక్యతతో ప్రభాకర్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం అధ్యక్షుడు తన కమిటీని నామినేట్ చేసుకున్నారు. ఛాంబర్ సాధారణ కార్యదర్శిగా డి.మాధవ, అలాగే ఇద్దరు ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస రావు, నరేంద్ర బెహరా, ఇద్దరు సహాయ కార్యదర్శులుగా లోక్‌నాథ్ బెహరా, శ్రావణకుమార్ దాకా లను నియమించుకున్నారు. కోశాధ్యక్షుడిగా మంగిలాల్ సాహు నియమితులయ్యారు. అధ్యక్షుడిగా విజయం సాధించిన ప్రభాకర్ గత పదేళ్లుగా ఛాంబర్ సాధారణ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. డైరెక్టర్ల ఎన్నికల్లో అందరికన్నా అత్యధిక ఓట్లు సాధించి, అగ్రస్థానంలో నిలిచిన రత్నాల కిశోర్‌కుమార్.. అధ్యక్షుడిగా పోటీ చేసి, ఓటమి చెందడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నీలాంగుడలో భూమి పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గమాంగొ

రాయగడ:

జిల్లాలోని రామనగుడ సమితి నీలాంగుడ పంచాయతీలో 43మందికి భూమి పట్టాలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలోగుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిళ్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా స్థలాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామనగుడ తహసీల్దార్ నిర్మల్ చంద్ర సాహు, జిల్లా పరిషత్ సభ్యులు సురేష్ గొమాంగొ, నీలాంగుడ సర్పంచు గీతాంజలి దొర తదితరులు పాల్గొన్నారు.

బలి జాతరలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్

కొరాపుట్: నవరంగపూర్ జిల్లా తెంతులకుంటి సమితి అమలాబట్ట గ్రామంలో బలజాతర పూజలు మంగళవారం ప్రారంభించారు. చైత్రమాస ముగింపులో భాగంగా ఏటా అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో గ్రామదేవత యాత్ర(బలి జాతర) చేపడతారు. కరోనా నేపథ్యంలో గత రెండేళ్లు యాత్ర జరగక పోవడంతో.. ఈ ఏడాది యాత్రకు ప్రాధాన్యం ఏర్పడింది. సమీప నది నుంచి ఇసుకను పవిత్ర బుట్టలలో గ్రామస్తులు సేకరించారు. ఇందులో వరి వంగడాలు వేశారు. అనంతరం గ్రామదేవత గుడి వద్ద భద్రపరిచారు. యాత్రలో భాగంగా కొద్ది రోజులకు వరి వంగడాలు మొలకెత్తుతాయి. వీటిని ర్యాలీగా తీసుకువెళ్లి, గ్రామ సరిహద్దులో ఉన్న దేవతకు సమర్పిస్తారు. దీనివల్ల గ్రామం సుభిక్షంగా ఉంటుందని గ్రామస్తుల విశ్వాసం. ఎమ్మెల్యే పవిత్ర మట్టిని గిరిజనుల తలపై అమర్చారు. అనంతరం భారీ ర్యాలీ చేటప్టారు.



గిరిజనుల తలపై పవిత్ర మట్టిని అమర్చుతున్న దృశ్యం

5టీ పేరుతో నిధుల దోపిడి

- భారతీయ రాష్ట్ర సమితి నాయకుల ఆరోపణలు



మీడియాతో మాట్లాడుతున్న రవీంద్ర మహాపాత్రొ, గోపాలరావు

జయపురం: రాష్ట్రంలో 5టీ పేరుతో కోట్లాది రూపాయల దోపిడీ జరుగుతోందని భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) కొరాపుట్ జిల్లా నాయకులు ఆరోపించారు. పట్టణంలోని బాబాసాహెబ్ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీఎర్‌ఎస్ నాయకుడు రవీంద్ర మహాపాత్రొ మాట్లాడారు. 5టీ పథకంలో పాఠశాలల సుందరీకరణ, మరమ్మతుల కోసం రూ.కోట్లలో ప్రభుత్వ ధనం ఖర్చు చేస్తున్నా.. విద్యారంగంలో ఎటువంటి ప్రగతి కానరావడం లేదని విమర్శించారు. నిర్మాణం జరిగిన పాఠశాలల శ్లాబులు 2మూడు నెలల్లోనే పెచ్చులు ఊడుతున్నాయని మండిపడ్డారు. తలుపులు, కిటికీలు విరిగి పోతున్నాయని, అన్నిచోట్లా నాణ్యతలేని పనులేనని ఆక్షేపించారు. టెండర్లు పిలువకుండానే ఎక్కువ ప్రాంతాల్లో జూనియర్ ఇంజినీర్లతో పనులు చేయిస్తున్నారని, వీటిపై ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోగా జేఈ లను సన్మానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ నియమం, మున్సిపాలిటీ చట్టాల ప్రకారం రూ.3 లక్షలు, పంచాయతీ నిబంధనల అనసారంగా రూ.10 లక్షల కంటే ఎక్కువ పనులకు టెండర్లు పిలవాలని గుర్తుచేశారు. అయితే 5టీ పనుల విషయంలో ఇవేమీ పాటించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు గోపాలరావు పాల్గొన్నారు.

విద్యా విధానానికి పెద్దపీట

- రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి సరక



పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో మంత్రి జగన్నాథ సరక

రాయగడ: రాష్ట్రప్రభుత్వం విద్యావిధానానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక తెలిపారు. జిల్లాలోని కాసీపూర్ సమితి లక్రీస్ పంచాయతీ సమగ్ర శిఖ అభిజాన్ పథకంలో భాగంగా మంజూరైన రూ.87.67 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 5టీ పథకంలో ఎన్నో పాఠశాలలను ఆధునీకరించడంతో వాటి రూపురేఖలు మారిపోయాయని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు ఆధునిక, సాంకేతిక విద్యావిధానాన్ని పొందగలుగుతున్నారని సంతృప్తి వ్యక్తంచేశారు. ఆదివాసీ, హరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యార్థులు చదువుపై శ్రద్ధ కనబరిచి, విద్యారంగంలో ముందుకు వెళ్లాలని సూచించారు. తదనుగుణంగా ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి, హెచ్‌ఎం నవకుమారి నాయక్ పాల్గొన్నారు.

గుండిచా మందిర నిర్మాణం పరిశీలన..

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో సుమారు రూ.కోటి వ్యయంతో ప్రారంభించిన గుండిచా మందిరం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక సూచించారు. గుణుపూర్‌లో పర్యటించిన ఆయన.. నిర్మాణ దశలో ఉన్న గుండిచా మందిరం పనులను పర్యవేక్షించారు. ఇప్పటి వరకు పనుల పురోగతి, ఖర్చు వివరాలను మందిర కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ పండా వివరిస్తూ... ఇప్పటి వరకు రూ.19 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. సుమారు రూ.కోటి అంచనాతో మందిరాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించామని, స్థానికుల నుంచి విరాళాల రూపంలో కొంతమొత్తం నిధులు సమకూరుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ ద్వారా నిధులు మంజూరు కోసం తనవంతు సహకరిస్తానని మంత్రి సరక ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్ పాల్గొన్నారు.



గుండిచా మందిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సరక, దాస్

క్లుప్తంగా

సారాతో ఇద్దరి అరెస్ట్

జయపురం: సారా తరలించడంతో పాటు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నిందితులను ఎక్సైజ్ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ దుర్యోధన బిశ్వాల్, ఏఎస్‌ఐ సంజయ కుమార్ కండి, ఏఎస్‌ఐ ఎం.లక్ష్మణరావు తమ సిబ్బందితో పెట్రోలింగ్ చేపట్టారు. అదే సమయంలో జయపురం వైపు బైక్‌పై వస్తున్న రామ చంద్ర హియాల్(22), సారా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నువాపుట్ గ్రామంలో ఇంట్లో సారా భద్రపరిచి, విక్రయిస్తున్న సదాచలాన్(37)ను అరెస్ట్ చేశారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి, విచారిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో జారీ చేయండి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంతారావు

విజయనగరం ఫోర్ట్: గుడ్లు సరఫరాలో తేడా ఉండడంతో అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో జారీ చేయాలని సీడీపీఓ ప్రసన్నను రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక కణపాక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అతర్వాత రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో అందించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజనం పెట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ మధుసూదన్‌రావు, సీఎస్‌డీటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్, స్టాఫ్‌నర్స్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో ల్యాబ్‌టెక్నీషియన్, స్టాఫ్‌నర్సు, టెక్నికల్ సూపర్‌వైజర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి కె.సత్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

సకాలంలో మట్టి నమూనాలు సేకరించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి తారకరామరావు

విజయనగరం ఫోర్ట్: రైతుల పొలాల్లో సకాలంలో మట్టి నమూనాలు సేకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారాకరామారావు సూచించారు. ఈ మేరకు స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో బుధవారం మట్టి నమూనాల సేకరణ, పరీక్షల విధానంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని చెప్పారు. ప్రతి రైతు భుసార పరీక్ష చేసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఎ.డి భానులత, ఎ.డి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

టాప్-3లో సీఎం నవీన్



సీఎం నవీన్ పట్నాయక్

- దేశంలో మూడో ధనిక ముఖ్యమంత్రిగా రికార్డు
- వార్షిక నివేదిక వెల్లడించిన ఏడీఆర్

భువనేశ్వర్: దేశంలోని 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులలో రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్ మూడో అత్యంత ధనవంతుడని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) బుధవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. దీని ప్రకారం నవీన్ రూ.63.87 కోట్ల విలువైన ఆస్తులను కలిగి ఉన్నారు. ఇందులో రూ. 23,26,555 విలువైన చరాస్తులు, రూ.63,64,15,261ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. స్వీయ ఆదాయం రూ.21.17 లక్షలు కాగా, అతని అప్పులు రూ.15 లక్షలని ఏడీఆర్ తెలిపింది. గత సంవత్సరం చర, స్థిరాస్తులకు సంబంధించి పట్నాయక్ ప్రకటించిన ప్రకారం 2021 డిసెంబర్ 31నాటికి ముఖ్యమంత్రి వద్ద రూ.94.41 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. అతనికి భారతీయ స్టేట్‌బ్యాంకు, జన్‌పథ్, న్యూఢిల్లీ బ్రాంచ్, పార్లమెంట్ హౌస్ బ్రాంచ్, భువనేశ్వర్ శాఖల్లో మూడు ఖాతాలు ఉన్నాయి. వీటితో పాటు మరో మూడు ఉమ్మడి బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. గంజాం జిల్లా హింజిలికాట్ కాలేజ్ క్యాంపస్ బ్రాంచ్‌లో 2, బర్‌గడ్ జిల్లా పదంపూర్ బ్రాంచ్‌లో ఒక ఖాతా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. సాధారణ ఎన్నికల ప్రయోజనాల కోసం వర్తించిన ఖాతాలుగా నివేదిక తెలియజేసింది. ముఖ్యమంత్రుల సగటు ఆస్తులు: రాష్ట్ర అసెంబ్లీలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఒక్కో ముఖ్యమంత్రి సగటు ఆస్తుల విలువ రూ.33.96 కోట్లు. కోటీశ్వరుల ముఖ్యమంత్రులు: 30 రాష్ట్ర శాసనసభలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులలో 29 మంది(97%) కోటీశ్వరులు. దేశవ్యాప్తంగా 9మంది ముఖ్యమంత్రులు రూ.కోటి, అంతకంటే ఎక్కువ అప్పులు ప్రకటించారు.

చరాస్తులు..

నవీన్ పట్నాయక్ చరాస్తులలో పోస్టాఫీస్ సేవింగ్స్ రూ.5,033, ఫిక్స్‌డ్ డిపాజిట్ రూ.1.11 కోట్లు, భారతీయ రిజర్వు బ్యాంకు బాండ్లు రూ.9 కోట్లు, పోస్టాఫీసు టర్మ్ డిపాజిట్ రూ.కోటి 34 లక్షల విలువైన ఆభరణాలు, రూ.6,434 విలువ చేసే అంబాసిడర్ కారు(1980 మోడల్) ఉన్నాయి.

స్థిరాస్తులు..

దాదాపు రూ.9,52,46,190ల విలువైన నవీన్ నివాస్‌లో మూడింట రెండు వంతుల వాటా, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రోడ్, న్యూఢిల్లీలో రూ.43,36,18,000 విలువైన ఆస్తిలో 50శాతం వాటా ఉంది. ఈ రెండు వారసత్వ ఆస్తులుగా పేర్కొన్నారు. రూ.510 కోట్ల సమగ్ర ఆస్తులతో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రూ.163 కోట్లకు పైగా ఆస్తులతో అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ రెండో స్థానంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా నిలిచారు.

జపాన్ పర్యటన విజయవంతం



తన నివాసం నుంచి వేసవి తీవ్రతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న సీఎం నవీన్

- ప్రకటించిన సీఎం నవీన్ పట్నాయక్
- వచ్చీ రాగానే రాష్ట్రంలో పరిస్థితిపై అధికారులతో సమీక్ష

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వారం రోజుల జపాన్ పర్యటన ముగించుకుని మంగళవారం సాయంత్రం రాష్ట్రానికి చేరుకున్నారు. ఈ మేరకు తన పర్యటన విజయవంతమైనట్లు ప్రకటించారు. స్వరాష్ట్రం చేరడంతో రాష్ట్రంలో తాజా స్థితిగతులను సమీక్షించేందుకు రాత్రికి రాత్రే ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై సమీక్షించారు. ప్రధానంగా రాష్ట్రంలో తాండవిస్తున్న వడగాడ్పుల తీవ్రత, కోవిడ్ సంక్రమణ స్థితిగతులను అధికారులతో సమీక్షించారు. ఈ నేపథ్యంలో వివిధ ఆరోగ్య సంబంధిత సౌకర్యాలపై సీనియర్ అధికారులతో చర్చించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో వడగాలుల తీవ్రత అధికంగా ఉంది. ఈ పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగే పరిస్థితులు నెలకొని ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పాలనా యంత్రాంగం.. పంచాయతీ రాజ్, తాగునీటి, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖల సంసిద్ధతపై అధికారులతో సంప్రదించారు. తాండవిస్తున్న విపత్కర పరిస్థితులను సమయానుకూలంగా అధిగమించేందుకు ముందస్తు కార్యాచరణతో పకడ్బందీగా సిద్ధం కావాలని ఆదేశించారు. నీటి ఎద్దడిపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు. వడగాడ్పుల పరిస్థితులలో అవసరాలకు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ విభాగం చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు.

కోవిడ్ పరిస్థితిపై..

రుతు పవనాల గురించి ముందస్తు సమాచారం సేకరించి, తదనుగుణంగా అధునాతన పద్ధతిలో సమయానుకూల ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. వృత్తిపరమైన వాతావరణ పరిశోధన కేంద్రాల సంప్రదింపులతో అనుబంధ విభాగాలు సత్వర చర్యలకు సిద్ధం కావాలని తెలిపారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వివిధ కార్యకలాపాలను సమీక్షించిన సందర్భంగా, ఒడిశాలోని దాదాపు మూడున్నర కోట్ల మందికి ఉచిత ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించే బిజు స్వాస్థ్య కల్యాణ్ యోజన(బీఎస్‌కేవై) పథకం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, లబ్ధిదారులందరికీ సత్వర వైద్యం అందేలా చూడాలని ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖకు సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుత కోవిడ్ పరిస్థితిని సమీక్షించగా.. కోవిడ్ పరిస్థితి అదుపులో ఉన్నట్లు అధికారులు వివరించారు. సంక్రమణ వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం భారీ అవగాహన కార్యక్రమంతో పాటు అన్ని విధాలా ముందస్తు చర్యలు చేపట్టి, పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని వివరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యదర్శి(5టీ) వీకే పాండియన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, అభివృద్ధి కమిషనర్ అను గర్గ్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు.

మే 1న పైడితల్లి దేవర మహోత్సవం

- ఉయ్యాలకంబాల ఉత్సవం వరకు చదురుగుడిలోనే అమ్మ దర్శనం
- దేవర ఉత్సవ వివరాలు వెల్లడించిన ఈఓ సుధారాణి



దేవర మహోత్సవం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ, ట్రస్ట్ బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం మే నెల 1వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు. అమ్మవారి కల్యాణమండపం ఆవరణలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పైడితల్లి అమ్మవారిని వనంగుడి నుంచి చదురుగుడికి తీసుకువచ్చే దేవర మహోత్సవాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మే 1న రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం అమ్మవారి ఉత్సవవిగ్రహాన్ని గాడీఖానా, ఎన్‌సీఎస్ రోడ్డు, గంటస్తంభం మీదుగా హుకుంపేటలో ఉన్న అమ్మవారి చదురు వద్దకు తీసుకెళ్లి పూజలు చేస్తామన్నారు. రాత్రి 10 గంటల నుంచి అమ్మవారిని హుకుంపేట నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా మంగళవారం వేకువజామున మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడిలోకి తీసుకెళ్లి అమ్మను ఆశీనులు చేస్తామన్నారు.

అప్పటి నుంచి ఉయ్యాల కంబాల మహోత్సవం వరకు అమ్మవారు చదురుగుడిలోనే భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ట్రస్టుబోర్డు సభ్యులతో కలిసి ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఉత్సవానికి సంబంధించి ఆలయ తలయారీతో ఈ నెల 24న చాటింపు వేయిస్తామన్నారు. అనంతరం దేవరమహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టు బోర్డు సభ్యులు పతివాడ వెంకటరావు, ఎమ్‌కేబీ శ్రీనివాసరావు, బలివాడ పార్వతి, గంధం లావణ్య, డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి, చిల్లా పుష్ప, ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

మిన్నంటిన ఉత్సవం



ఉత్తమ అధ్యాపకులకు పురస్కారాలు అందిస్తున్న ఎంపీ శేఖర్‌సాహు

బరంపురం: నగరంలోని బంజవిహార్ ప్రాంగణంలోని బిజు పట్నాయక్ ఆడిటోరియంలో బరంపురం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఉత్సవ్-2023 కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు ఎమ్మెల్యే విక్రమ్ పండాతో కలిసి జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఉత్తమ అధ్యాపకులు, విద్యార్థులను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన విద్యార్థుల వివిధ రకాల సాంస్కృతిక నృత్యాలు మిన్నంటాయి.



ఆకట్టుకుంటున్న విద్యార్థుల ఒడిస్సీ నృత్య ప్రదర్శన

అక్రమణల తొలగింపులో ఉద్రిక్తం

- భవనంపై నుంచి దూకేసిన దుకాణ నిర్వాహకుడు



కాలువపై ఉన్న ఆక్రమిత దుకాణం జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ ప్రాంతంలో చేపట్టిన ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా జంక్షన్‌లోని ఆక్రమణలు తొలగించేందుకు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. అందులో భాగంగా అయోధ్యామైదానం రోడ్డు నుంచి పువ్వాడ స్కూలుకు వెళ్లే ఎడమ వైపు మార్గంలో కార్పొరేషన్ కాలువను ఆక్రమించి నిర్వహిస్తున్న చిన్నపాటి దుకాణాన్ని జేసీబీతో తొలగించేందుకు ఉపక్రమించారు. దీంతో దుకాణ నిర్వాహకుడు రమణ అడ్డుకునేందుకు ప్రయత్నించి భవనంపైకి ఎక్కి హడావుడి చేశాడు. తన దుకాణం తొలగిస్తే విద్యుత్ వైర్లు పట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు, కార్పొరేషన్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

అదే సందర్భంలో ఆందోళనకారుడు రమణ భవనంపై నుంచి రోడ్డుపైకి దూకడంతో ఉద్రిక్తతకు దారితీసింది. తక్షణమే స్పందించిన టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు హుటాహుటిన జిల్లా కేంద్రాస్పత్రికి బాధితుడు రమణను తరలించారు. ఇదిలా ఉండగా నిబంధనల మేరకు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టామని, గతంలో పలుమార్లు మౌఖికంగా చెప్పామని సిటీ అసిస్టెంట్ ప్లానర్ మధుసూదనరావు తెలిపారు. కాలువలను ఆక్రమించి దుకాణాలు నిర్వహించడంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుందన్నారు. నగరంలో ఆక్రమణలపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.



భవనంపై నుంచి దూకిన రమణ

భీమాలి తాండ్రకు జీఐ.ట్యాగ్ అవసరం

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: జిల్లాలోని భీమాలి మామిడి తాండ్రకు జియోగ్రఫీ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ తీసుకొస్తే మంచి లాభాలను ఆర్జించవచ్చని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. 'ప్రాస్పెక్టస్ అండ్ ప్రాబ్లమ్స్ ఆఫ్ మేంగో జెల్లీ బిజినెస్' అనే అంశంపై స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం జరిగిన ఒక రోజు సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌కోట మండలం భీమాలి గ్రామం మామిడి తాండ్రకు ప్రసిద్ధి కానీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదన్నారు. ఇక్కడి తాండ్ర వ్యాపారానికి అవసరమైన వ్యాపార మెలకువలు, బ్రాండింగ్, నాణ్యత, స్టోరేజ్ సౌకర్యం పెంచితే భీమాలి తాండ్రకు జీఐ ట్యాగ్ తీసుకురావచ్చన్నారు. తాండ్ర వ్యాపార అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై యూనివర్సిటీ విద్యార్థుల ద్వారా సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. యూనివర్సిటీ విద్యార్థులకు భీమాలి తాండ్ర తయారీ, అమ్మకం ప్రాజెక్ట వర్క్‌గా కూడా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఏ ఏపీపీ సావిత్రి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జయశ్రీ, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కళింగ వర్ధన్, అంబికా స్వీట్స్ సీఈఓ శ్రీనివాస్, భీమాలి సర్పంచ్ కృష్ణ తదితరులు మామిడి తాండ్ర తయారీకి సంబంధించిన సమస్యలు, వ్యాపారానికి సంబంధించిన వివిధ సూచనలు సలహాలను అందించారు. అనంతరం సీటీయూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు భీమాలి మామిడి రైతులతో వివిధ అంశాలపై చర్చించారు. సదస్సుకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎస్‌పీఎస్ సూర్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


అనుబంధ రంగాలతో ఆదాయం



గిరిజన రైతులకు జీవాలు ఇస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, శాస్త్రవేత్తలు

శృంగవరపుకోట: వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించడం వల్ల అదనపు ఆదాయం సాధించుకోవచ్చని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం మండలంలోని బొడ్డవర రైతు భరోసా కేంద్రం పరిధిలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్-ఎస్‌టీఐఏఆర్‌ల సమన్వయంతో విజయనగరం ఏరువాక కేంద్రం పరిధిలో 200 గిరిజన కుటుంబాలతో గిరిజన ఉప ప్రణాళిక శిక్షణ కార్యక్రమం నిర్వహిలచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ పాడి, లేగదూడలు, కోళ్లు, జీవాల పెంపకం వంటి అనుబంధ రంగాలపై అవగాహన, పంటల్లో జీవనియంత్రణ, సేంద్రియ సాగు, విలువ ఆధారిత ఉత్పత్తులు పండించే మార్గాలు తెలుసుకుని అనుసరించాలని సూచించారు. డాక్టర్ ఎస్ఎన్ సునీల్, డాక్టర్ కె.శ్రీదేవిలు వివిధ పంటల్లో జీవ నియంత్రణ గురించి శిక్షణలో వివరించారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంచాలకుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, విలువ ఆధారిత ఉత్పత్తులు గ్రామస్థాయిలో వ్యయసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్‌ను తెలియజేశారు. విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.అనూరాధ, డాక్టర్ ఎం ఎంవి.శ్రీనివాసరావులు చిరుధాన్యాలు, సమగ్ర వ్యవసాయ విధానం గురించి క్షుణ్ణంగా వివరించారు. ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.లక్ష్మణ్ భాగస్వామ్య రైతాంగానికి మేకలు, వనశ్రీ కోళ్లు, డూప్లెక్స్ కోళ్ల గూళ్లు, జీడిమామిడి అంట్లు, కూరగాయల విత్తనాలు, అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ తేజేశ్వరరావు, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు రామారావు, సహాయ సంచాలకురాలు ఎల్.విజయ, మండల వ్యవసాయ అధికారి రవీంద్ర, గ్రామసర్పంచ్ మీనా, ఎంటీసీ లక్ష్మి, మురళీరాజు, కేత వీరన్నలతో పాటు అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణంలో నిర్వహించిన అరబిందో ఫార్మా కంపెనీ జాబ్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 283 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 171 మందిని అరబిందో ఫార్మా కంపెనీలో ఎంపిక చేశామన్నారు. 26 మంది తుది రౌండ్ కోసం ఎంపిక య్యారని తెలిపారు. శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ చలపతి రావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇది ఐదో సారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నతా శిఖరాలు అధిరోహించాలని కోరారు.

క్లుప్తంగా

పీజీ సెట్ కన్వీనర్‌కు కోర్సుల వివరాలు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర పీజీ సెట్ నిర్వహణకు సంబంధించి ఏయూ ప్రొఫెసర్ కె.రమణయ్యకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పీజీ కోర్సుల వివరాలు అందజేసినట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. రాష్ట్ర పీజీ సెట్ ఆధారంగా విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయంలో సైన్స్ కోర్సులకు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్, ఫిజిక్స్, ఆర్ట్సుకు సంబంధించి ఎంకాం, ఎకనామిక్స్, ఇంగ్లిష్, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, సోషల్ వర్క్, తెలుగు, రూరల్ డెవలప్‌మెంట్, ఎంజేఎంసీ ఉన్నట్లు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్సిటీలో పూర్తయిన పురుషుల వసతి గృహం భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

రూపాదేవికి ఉపాధ్యాయుల సత్కారం


రూపాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: పారా బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటిన సంతవురిటి గ్రామానికి చెందిన పడాల రూపాదేవిని అదే గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం సత్కరించారు. రూపాదేవి ఇదే పాఠశాలలో పదో తరగతి వరకూ చదివారు. ఐదో జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న ఆమె బంగారు, రెండు వెండి పతాకాలను సాధించారు. రెండు కాళ్లు లేకపోయినా ఈమె ప్రతిభపై ఈనెల పదో తేదీన 'పట్టుదలకు ప్రతి రూపం' శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ఆమె ప్రతిభను కొనియాడారు.

డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా

శ్రీకాకుళం పాతబస్టాండ్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి నాయకులు కోరారు. మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శ్రీకాకుళం జిల్లా జేఏసీ, అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగులు నల్ల రిబ్బన్లు పెట్టుకుని శ్రీకాకుళం అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఉన్న రెవెన్యూ గెస్ట్ హౌస్ వద్ద బుధవారం ధర్నా చేశారు. డీఏ, పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని, 11వ పీఆర్సీ పేస్కేల్ అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఎంప్లాయీస్ హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో ఇవ్వాలని కోరారు. కరోనా ముందు, కరోనా సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ శ్రీకాకుళం జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు, అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, జనరల్ సెక్రెటరీ రమణ, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ చక్రవర్తి, సింహాచలం, మురళీధర్ నాయక్, డి.పద్మావతి, సెక్రటరీ బి.వి.వి.ఎన్. రాజు, జి.కె.శ్రీనివాసరావు, గణేష్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు డి.సోనికిరణ్, రాజారెడ్డి, సచివాలయం జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగ సంఘ నాయకులు జల్లేపల్లి రామారావు, ఎం. కాశీప్రసాద్, డి.చందు, క్లాస్ ఫ్లోర్ ఉద్యోగుల సంఘ నాయకులు సీహెచ్ తారకేశ్వరరావు, డ్రైవర్ల సంఘం నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న జేఈఈ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 6 నుంచి జరుగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. బుధవారం ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 99 మందికి 96 మంది, రెండో షిఫ్టులో 91 మందికి 77 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఒకేషిఫ్టులో 80 మందికి గాను అందరూ హాజరయ్యారు.

మరో రెండు రోజులు పొడి వాతావరణం

ఆమదాలవలస: ఉత్తరకోస్తాలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు పొడివాతావరణం ఉంటుందని ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక బుధవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల సెంటిగ్రేడ్ అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధిక ఎండల నేపథ్యంలో బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మజ్జిగ, నీరు తరచూ తాగిగే డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉండవచ్చని తెలిపారు. పాడి పశువులను సైతం ఎండల్లో ఉంచకుండా జాగ్రత్త పడాలని రైతులకు సూచించారు.

మన జీవనం బిజీగా మారిపోయింది. తెల్లవారి లేచింది మొదలు.. రాత్రి నిద్రపోయే వరకు ఉరుకులు పరుగులే. ఉదయం లేవడం దైనందిన కార్యక్రమాలు ముగించుకుని.. ఉద్యోగ వ్యాపకాలకు పరుగులు తీయడం.. సాయంత్రమో రాత్రికి అలసి సొలసి గూటికి చేరుకోవడంతోనే సరిపోతుంది. అంతలోనే రాత్రి భోజనం, నిద్ర.. మళ్లీ తెల్లవారితే ఉరుకులు.. ఈ జీవనచక్రంలో చిక్కుకుపోయిన సగటు మనిషికి మానసిక ఉల్లాసం కరువవుతోంది. సరిగ్గా ఇటువంటి వారిని మరో లోకం ఆహ్వానిస్తోంది. సాయంత్రం దీపాల వెలుగులతోనే చైతన్యం నింపుకొని చీకటి రాత్రులను వెలుగుల రంగేళీగా మారుస్తోంది. నోరూరించే రకరకాల రుచులతో ఊరిస్తూ రారమ్మంటోంది. ఫ్లడ్ లైట్ల వెలుగులో ఔత్సాహిక క్రీడాకారుల ఉత్సాహానికి చక్కటి వేదికగా నిలుస్తోంది. అవును.. శ్రీకాకుళం నగరంలో ఇప్పుడు నిశి రాత్రి వేళ నవలోకం ఆవిష్కృతమవుతోంది. -శ్రీకాకుళం డెస్క్



అదిగో నవలోకం.. వెలిసే మనకోసం

వేసవి సాయంత్రం
విద్యుత్ వెలుగుల్లో
పద్మంలా ప్రతిబింబించే
పురాతన అలల నిలువుటద్దం
నా సిక్కోలు నగరం..

ఈ సాయంత్రం కాస్త ముదిరి చీకటి చిక్కబడుతున్న వేళ నగరంలో మరోపార్శ్వం ఆవిష్కృతమవుతోంది. ఓ వైపు అర్ధరాత్రి వరకు సాగే ఆటపాటల సందడి.. మరో వైపు రాక్ బ్యాండ్ హోరు.. జాజ్ మ్యూజిక్‌ల జోరు ఇంకో వైపు.. ఉదయమంతా తీరికలేని వ్యాపకాలతో బిజీగా గడిపే నగరవాసికి కొత్త రుచులు అందించే రుచుల కనువిందు..ఇలా ఎటు చూసినా బహుపసందుగా దర్శనమిస్తున్నాయి.

● స్వరాలు ఊయలూగు వేళ..

పసందైన విందుతో పాటు వీనుల విందైన స్వరాలు ఆలకిస్తూ డిన్నర్ చేస్తే ఆ మజాయే వేరు కదా. ఆ సదుపాయం సిక్కోలు వాసులకు అందుబాటులోకి వచ్చేసింది. తమ రెస్టారెంట్‌కు వచ్చే ఫుడ్ లవర్స్‌కు లైవ్ ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు నిర్వాహకులు. రాక్ నుంచి జాజ్ వరకు అన్ని రకాల పాటల్ని వినిపిస్తూ భోజన, సంగీత ప్రియులతో శభాష్ అనిపించుకుంటున్నారు. ఔత్సాహికులైన కళాకారుల్ని ప్రోత్సహించేందుకు వేదికను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. మీలో ఉన్న కళను కూడా ఆ వేదికపై ప్రదర్శించే అవకాశాన్ని కూడా కల్పించారు. ఇటీవలే నగరానికి చెందిన నృత్యకారుడు తన బృందంతో ఈ రెస్టారెంట్ వేదికపై ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు కూడా.

ఎక్కడ
శ్రీకాకుళం 80 అడుగుల రోడ్ చివరిలో..



వీనుల విందు..


ఓ వైపు ఇష్టమైన పాటలు.. మరో వైపు చక్కటి భోజనం.. ఎంజాయ్ చేస్తా. ఎంత ఒత్తిడిలో ఉన్నా ఇక్కడకు వచ్చే సరికి చాలా హాయిగా అనిపిస్తుంది. – కోరాడ శంశాక్



● పాన్‌లో ఫైర్ ఉంది..

నగరంలో రాత్రి వేళ కిళ్లీ దుకాణాలు కళకళలాడుతుంటాయి. భోజనం అనంతరం తాంబూలం వేసే వాళ్లందరూ తమ కిష్టమైన కిళ్లీ రుచి కోసం ఎదురుచూస్తుంటారు. ఈ పాన్‌లలో కూడా బోలెడు రుచుల్ని సిక్కోలులో విక్రయిస్తున్నారు. వీటిని విక్రయించేందుకు రాజస్థాన్ నుంచి వచ్చిన వ్యాపారులు పాన్‌మహల్ పేరిట ప్రత్యేక దుకాణాల్నే ప్రారంభించారు. మిఠాయి కిళ్లీలతో పాటు ఫైర్‌పాన్‌ల విక్రయాలు బాగున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు.



● ఉత్తరాది రుచులు

పానీ పూరీ.. దహీపూరీ.. కతోరీ చాట్.. సేవ్‌పూరీ.. దహీపాపిడీ.. ఆలూ టిక్కా, రగడ.. మసాలా పావ్‌బాజీ.. ఇలా ఉత్తరాదిలో ఖ్యాతిగాంచిన వంటల మెనూతో చీకటిపడితే చాలు ఆ జంక్షన్ సందడిగా కనిపిస్తుంది. ఎల్ఈడీ వెలుగుల్లో ఫ్యామిలీలతో రుచుల్ని ఆస్వాదిస్తుంటారు నగరవాసులు.

ఎక్కడ
పాలకొండ రోడ్‌లోని గాంధీ పార్కు సమీపంలో..

పానీపూరీ తింటాం..


రోజూ పానీపూరి తినే ఇంటికి వెళ్తా. శాకాహారం అంటే ఇష్టం. చాట్ ఐటెమ్స్ చాలా ఇక్కడ దొరుకుతాయి. అయితే కొంచెం రద్దీగా ఉంటుంది.
– ఎం.భాగ్యలక్ష్మి, పీఎస్‌పేట

● అర్ధరాత్రి వరకూ ఆటాడుకుందాం రా..

ఆడాలని ఉంటుంది. కానీ ఆడలేరు. సమయం కేటాయించలేరు. పగలంతా ఉద్యోగ బాధ్యతలు. చీకటిపడితే తప్ప ఇంటికి చేరని పరిస్థితి. మరెప్పుడు ఆడాలి.. ఎక్కడ ఆడాలి. ఇలాంటి క్రికెట్ క్రీడా ప్రియులకు అర్ధరాత్రి వరకు ఆడే అవకాశం కల్పిస్తోంది ఓ సంస్థ. వికెట్‌ల నుంచి బ్యాట్‌ల వర కు అన్నీ వారే సమకూరుస్తారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో అర్ధరాత్రి వరకు ఆటాడుకుందాం రా.. అంటూ మీ క్రీడా సరదా తీసుకోవచ్చు. పనిలో పనిగా ఫిట్‌నెస్ పెంచుకోవచ్చు. అయితే మీ టీమ్ అందరికీ కలిసి గంటకు రూ.700 వరకు చార్జీ చేస్తున్నారు. కూల్‌డ్రింక్స్, ఫుడ్ అదే ఆవరణలో విక్రయిస్తున్నారు.

ఎక్కడ
పీఎస్ఎన్ఎం స్కూల్ పక్క రోడ్డులో.. ఎగ్జిబిషన్ మైదానం ఆనుకుని..

సరదా తీరేదాకా..


ఉదయమంతా వ్యాపారం. ఇతర బాధ్యతలు. గ్రౌండ్‌కు వెళ్దామంటే వీలుకాదు. అందుకే వీలున్నప్పుడల్లా మా టీమ్‌తో వచ్చి ఇక్కడ కనీసం రెండు మూడు గంటలు.. క్రికెట్ ఆడతాం.
-కె.ఉదయ్‌కుమార్

నాగావళి చెంతన.. నెయ్యి ఇడ్లీ ఘుమఘుమ..

పొగలు కక్కే ఆవిరి సెగలతో ఇడ్లీలు చీకటికి వెల్‌కమ్ చెబుతాయి. వాటిపై మరుగుతున్న నెయ్యి వేసి.. కారం పొడి దట్టించి ఇష్టంగా లాగించేస్తుంటారు టిఫిన్ ప్రియులు. ఈ అల్పాహార అడ్డా రుచులకు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. రాత్రి పదిన్నర దాటినా సందడిగా ఉంటుంది ఈ ప్రాంతం.

ఎక్కడ
కిమ్స్ ఆస్పత్రి నుంచి కొత్తబ్రిడ్జికి వెళ్లే దారిలో..



వేడిగా ఆరగిస్తే..


ఇడ్లీ చాలా బాగుంటుంది. వారానికి కనీసం ఒక్కసారైనా రుచి చూస్తా. నెయ్యి ఇడ్లీ ఇక్కడ హాట్‌ఫేవరెట్. దోసెలు కూడా.. –పెంట ఈశ్వరరావు

మనసు దోసెయ్..

చీకటిపడితే చాలు కూడళ్లలో దోసెల పెనాలు సుయ్‌మంటూ శబ్దం చేస్తూ అల్పాహార ప్రియుల ఆకలి తీర్చేస్తుంటాయి. పన్నీరు నుంచి ఎగ్ వరకు వివిధ రకాల దోసెల్ని తయారు చేసి వడ్డిస్తున్నారు నిర్వాహకులు. వీటి రుచుల్ని ఆస్వాదించాలంటే మాత్రం కొంచెం వేచి చూడాలి. ఎందుకంటే అవి విక్రయించే ప్రాంతాల్లో రద్దీ అంతగా ఉంటోంది మరి.

ఎక్కడ
పీఎస్ఎన్ఎం స్కూల్ పరిసరాలు సూర్య మహల్ జంక్షన్ సమీపంలో..



పన్నీర్ దోసె ఇష్టం..


రోజూ రాత్రి టిఫిన్‌కు వస్తుంటా. నగరంలోని కూడళ్లలో లభ్యమయ్యే పన్నీరు దోసె అంటే చాలా ఇష్టం. వీకెండ్స్‌లో చాలా రద్దీగా ఉంటుంది. -జి.వెంకట ఆదిత్య

టీడీపీ ఎత్తుగడలను ప్రజలు గమనిస్తున్నారు

● వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదు


ఎమ్మెల్యే అశోక్ పక్కన ఉన్న బాలరాజు ఫొటోను సెల్‌లో చూపిస్తున్న నారాయణమ్మ


అక్టోబర్‌లో ఎమ్మెల్యే అశోక్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న గిన్ని బాలరాజు(వృత్తంలో వ్యక్తి)

ఇచ్ఛాపురం రూరల్: వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి, ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ కార్యకర్తలకే మళ్లీ పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రచారం చేయడం సిగ్గుచేటని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. మంగళవారం కీర్తిపురం గ్రామానికి చెందిన గిన్ని బాలరాజు ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారంటూ వారికి ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు పచ్చ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే బాలరాజుతో పాటు మరికొంత మంది టీడీపీకి చెందిన కార్యకర్తలు కావడం విశేషం. టీడీపీలో చేరికలంటూ ప్రచారం కల్పించేందుకు ఆ పార్టీ మండల నాయకుల ఎత్తుగడలను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం చిత్తుచేశారు. ఇచ్ఛాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ మాట్లాడుతూ.. టీడీపీకి చెందిన వ్యక్తులకే పదేపదే పచ్చకండువాలు వేసి అబాసుపాలు కావడం కంటే అభివృద్ధి చేస్తున్న వైఎస్సార్‌సీపీ తీర్థం పుచుకోవాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గస్థాయిలోని నాలుగు ఎంపీపీలు, జెడ్పీటీసీలతో పాటు మున్సిపాలిటీని కైవసం చేసుకున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం శాసనసభ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగువవేస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పిట్ట ఆనంద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, మండల పార్టీ కార్యదర్శి రాంపత్ని చిట్టిబాబు, పిట్ట మామయ్య పాల్గొన్నారు.

పోర్టు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ దువ్వాడ


పోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ తదితరులు

సంతబొమ్మాళి: భావనపాడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో విశ్వసముద్ర ఎండీ అనిల్‌కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. విష్ణుచక్రం, మూలపేట తీరప్రాంతాల్లో భూమిపూజ, పైలాన్ ఆవిష్కరణ, సీఎం హెలిప్యాడ్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం నౌపడలో ఆర్అండ్‌బీ కాలనీ కోసం సేకరించిన భూమిలో భారీ బహిరంగసభకు స్థల పరిశీలన చేశారు. ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ చలమయ్య, ఏపీ మారిటైంబోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల్లో విశేష ఆదరణ


మాట్లాడుతున్న కృష్ణ

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ బాగుందని శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, పొట్నూరు ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి లబ్ధిదారుడు జగనన్న పట్ల సదాభిప్రాయంతో ఉన్నారన్నారు. జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ అని లబ్ధిదారులు అంటున్నారని పేర్కొన్నారు. అలాగే నరసన్నపేట ప్రాంతంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పట్ల కూడా ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. పార్టీ నాయకుడు కణిత కృష్ణారావు ఉన్నారు.

చెప్పు కోసం ఆటోలోంచి గెంతేసిన యువకుడు

● తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైన వైనం



టెక్కలి రూరల్: ఆటోలో ప్రయాణిస్తున్న యువకుడు తన కాళ్ల చెప్పు పడిపోవడంతో సడన్‌గా అందులో నుంచి దూకేయడంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాం మండలం కాపుతెంబూరు గ్రామానికి చెందిన టి.శ్రీనివాసరావు వ్యక్తిగత పనుల నిమిత్తం బుధవారం టెక్కలి వచ్చాడు. పనులు ముగించుకుని ఆటోలో గ్రామానికి బయలు దేరాడు. ఆటో వెనుక కూర్చొని ఉన్న శ్రీనివాసరావు కాళ్ల చెప్పు ఒకటి నందిగాం మండలం తామరాపల్లి గ్రామసమీపంలో కిందకు జారి పడిపోయింది. అయితే చెప్పు కోసం వేగంగా వెళ్తున్న ఆటో నుంచి దూకేయడంతో తల వెనుక బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అతన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

విద్యార్థికి గాయాలపై ఏటీడబ్ల్యూఓ దర్యాప్తు


దర్యాప్తు నిర్వహిస్తున్న ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు

మందస: మండలంలోని కిల్లోయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘటన సంచలనంగా మారింది. ఉపాధ్యాయులు ప్రమాదంగా చెబుతున్నప్పటికీ.. విద్యార్థిని వంటకు వినియోగించడంతోనే సంఘటన జరిగినట్టు అధికారుల దర్యాప్తులో తేలింది. దీనిపై ఐటీడీఏ నూతన ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారికి నివేదికలు ఇవ్వనున్నట్టు దర్యాప్తు అధికారి చెప్పారు. దర్యాప్తులో వెల్లడైన వాస్తవాలను ఏటీడబ్ల్యూఓ ఎం.శ్రీనివాసరావు వివరించారు. కిల్లోయికాలనీ జీటీడబ్ల్యూఏహెచ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.గోపి.. ఆశ్రమంలో పనిచేస్తున్న కుక్ చిట్టయ్య వంట పనికి పిలడంతో తరగతి నుంచి వెళ్లాడు. అన్నం దించుతుండగా బరువు మోయలేక గంజిలో పడిపోయాడు. ఈ నెల 5న ఘటన జరుగగా హెచ్ఎం కె.మదన్‌మోహన్, డిప్యూటీ వార్డెన్ ఎస్.శ్రీరాములు, కుక్ చిట్టయ్య రహస్యంగా ఉంచారు. మందసలో ఉన్న ఏటీడబ్ల్యూఓకు కానీ, ఐటీడీఏ డిప్యూటీ డీఈఓ, డిప్యూటీ డైరెక్టర్, పీఓలకు గానీ తెలియజేయలేదు. స్థానికంగా ఓ ఆర్ఎంపీతో వైద్యం చేయించారు. వైద్యం వికటించడంతో గోపి చేయికి ఇన్‌ఫెక్షన్ సోకింది. గోపి తండ్రిలేకపోవడంతో పలాసలో ఉంటున్న తల్లి సీతకు ఫోన్లో మాట్లాడించి, తనకు బాగానే ఉందని ఉపాధ్యాయులు చెప్పించారు. పరిస్థితి చేయి దాటుతుండడంతో చివరకు డీడీ బి.నగేశ్‌కు తెలియజేయడంతో ఆయన ఆగ్రహించి, తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇప్పటికే ఎంఈఓ మర్రిపాటి లక్ష్మణరావు దర్యాప్తు చేయగా, బుధవారం మందస ఏటీడబ్ల్యూఓ ఎం.శ్రీనివాసరావు ఆశ్రమంలో సుదీర్ఘంగా దర్యాప్తు నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, కుక్, డిప్యూటీవార్డెన్, హెచ్ఎంలను విచారించారు. పలాసలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థి గోపి వద్దకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

అక్రమ రవాణా కట్టడికి సహకరించాలి



ఆటో అసోసియేషన్ డ్రైవర్స్‌కు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ నాగేశ్వర్రావు

శ్రీకాకుళం క్రైమ్ :

గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల సమాచారం తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగేశ్వరరావు ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రామలక్ష్మణ కూడలి వద్ద అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో టీనేజీ యువత చిన్న చిన్న సరదాలకు పోయి మత్తు పదార్థాలను అలవాటు చేసుకుంటున్నారని చెప్పారు. అవి వారికి చేరకుండా ఉండాలంటే వాటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే మంచి మార్గమన్నారు. ఆటోల్లో ఎవరైనా మిమ్మల్ని అడిగి గంజా, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలు తీసుకెళ్లమని చెబితే తమకు సమాచారమివ్వాలని కోరారు. సమాజసేవలో భాగంగా ఈ విషయంలో సహకరిస్తే భవిష్యత్తులో ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.